# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 182 | విశాఖపట్నం | 3-4-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు : 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 182 | VISAKHAPATNAM | 3-4-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Alluritsitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




## అమరావతి బిల్లుకు
# రాజ్యసభ ఆమోదం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్సభ ఆమోదించిన సంగతి తెలిసిందే.

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది.

## పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను
## పరిశీలించిన గవర్నర్




**ఏలూరు, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం ఏరియల్ వ్యూలో పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుండి పనులను పరిశీలించారు. గవర్నర్‌కు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి, ఎస్పీ.కె.ప్రతాప్ శివకిశోర్, ట్రైకార్ చైర్మన్ బరగం శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. పోలవరం ప్రాజెక్టు అడ్మిని స్ట్రేటరు ఎక్స్ అఫీషియో, జాయింటు కలెక్టరు వి.అభిషేక్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, ఏఎస్పీ లు ఆర్.సుస్మిత, జయాశర్మ, డి.హేమంత్, పంకజ్ కుమార్ మీనా, జి.మునిరాజు, ఆర్డీవో యం.వి. రమణ, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులపై ఆర్థికశాఖతో
# చంద్రబాబు సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఏపీ ఆర్థిక శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అధికారులను సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దానిపై కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపుతున్నామని అధికారులు వివరించారు. ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితోపాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవ్‌ల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.



2లో

### మౌంట్ ఎవరెస్ట్‌లో భారీ మోసం ..
### వెలుగులోకి రూ. 167 కోట్ల దందా

### గర్భధారణ సమయంలో మహిళలు ఒత్తిడిని తగ్గించుకోవాలి..!



6లో



2లో

### మధ్యాహ్నం భోజనం నిర్వాహకులపై
### మంత్రి ఫరూక్ ఆగ్రహం

## అమరావతి బిల్లుపై మోడీకి కృతజ్ఞతలు
# తెలిపిన లోకేశ్, ఎన్డీయే ఎంపీలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన ప్రధానిని కలిశారు. ప్రధానికి శాలువా కప్పి, ఏపీ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భేటీ అనంతరం లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. "అమరావతి కోసం తమ భూములను త్యాగం చేసి, ఏళ్ల తరబడి నిలబడిన రైతుల అసాధారణ గాథను ప్రధానికి వివరించాను. వారి త్యాగాలను గౌరవిస్తూ, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు మార్గనిర్దేశం కోరాను" అని పేర్కొన్నారు.



### యథేచ్ఛగా ఆర్వో ప్లాంట్లు..
### నీటి నాణ్యతపై అనుమానాలు?

5లో

## అమరావతి అతిపెద్ద
# కుంభకోణం: సుబ్బారెడ్డి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమరాతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. చర్చలో భాగంగా వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై బిల్లులో లేదన్నారు. అమరావతిలో ఒక్క శాశ్వత నిర్మాణమైనా జరగలేదని తెలిపారు. రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేదన్నారు. రాజ్యాం గంలో రాజధాని అంశం ఎక్కడ ఉందని ఎంపీ ప్రశ్నించారు. అనేక అంశాలపై బిల్లులో క్లారిటీ లేదన్నారు. అమరావతిని వైసీపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రైతుల నుంచి 50 వేల ఎకరాలు సేకరించారని.. ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగ లేదన్నారు. మౌలిక వసతులకే రూ.2 లక్షల కోట్లు అంటున్నారని తెలిపారు. రెండేళ్లలోనే రూ.3.40 లక్షల కోట్ల అప్పు చేశారని.. ఇలాగే కొనసాగితే రూ.14 లక్షల కోట్లకు అప్పు చేరుతుందని చెప్పుకొచ్చారు. అమరావతి అతిపెద్ద కుంభకోణమని వైవీ సుబ్బారెడ్డి ఆరో పించారు. ఆపై అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ వైసీపీ రాజ్యసభ నుంచి వాకౌట్ చేసింది.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం
పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను
బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు
సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## బేజారు..

అమెరికా-ఇజ్రాయిల్ ఇరాన్‌పై ప్రారంభించిన దాడులకు ముందు వారు అనుకున్నది ఒకటి. అయింది, అవుతున్నదీ మరొకటి. ఉన్మాదంతో ట్రంప్ ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేస్తున్నాడో చూస్తున్నాం. ఇది రాస్తున్న సమయానికి హార్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోయినా దాడులను ముగించాలనుంది అన్నట్లుగా వార్తలు వచ్చాయి. అయినప్పటికీ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దాడులు ఐదవ వారంలో ప్రవేశించాయి. కాల్పుల విరమణ చర్చల సంగతి ఎటూ తేలలేదు, అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పింది. పరిస్థితి ఇలా ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు (డాలరకు 95 రూపాయలు) ఖర్చు అవుతున్నాయి. ప్రపంచం 1970 దశకం నాటి స్టాగ్‌ఫ్లేషన్‌కు (ఆర్థికరంగం గిడసబారటం, ధరలు, నిరుద్యోగం పెరుగుదల దీని లక్షణాలు) గురవుతుందా అని కొందరు సందేహిస్తుండగా పరిస్థితి తీవ్రంగా ఉంది తప్ప అలాంటి అవకాశం లేదని మరికొందరంటున్నారు. అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం రాజులు లేరు, రాజరికాలు లేవు అంటూ ట్రంప్‌నకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. తొలిసారి 50, రెండవసారి 70, మూడవసారి 90 లక్షల మంది పాల్గొన్నారు. మూడవసారి మార్చి చివరి వారంలో జరిగిన ప్రదర్శనల్లో అమెరికాలో జరిగిన రోజునే వివిధ ఖండాలలోని పన్నెండు దేశాలలో కార్మికులు స్థానిక సమస్యలను తీసుకొని ప్రదర్శనలు జరపటం విశేషం. అమెరికా వినియోగదారులపై భారం ఎలా పడిందంటే ఫిబ్రవరి నెలలో జాతీయ సగటు గ్యాస్ ధర 2.98 డాలర్లు ఉంటే ఆదివారం నాడు అది 3.98 డాలర్లు ఉంది. సరఫరా, ధరల నియంత్రణలో భాగంగా 32 దేశాలు, 13 సహదేశాలు (వీటిలో మన దేశం లేదు) సభ్యులుగా ఉన్న అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఏ) తన పర్యవేక్షణలో ఉన్న 120 కోట్ల పీపాల చమురులో 40 కోట్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఆ సంస్థ నిబంధన ప్రకారం ప్రతి సభ్యదేశం 90 రోజులకు సరిపడా చమురు ఉత్పత్తులను నిల్వ చేసుకోవాలి. ఈ యుద్ధం ప్రపంచ చమురు మార్కెట్ చరిత్రలో సరఫరా విచ్ఛిన్నంలో అతి పెద్దదని ఆ సంస్థ పేర్కొన్నది. దీనికి ట్రంప్ బాధ్యుడని వేరే చెప్పనవసరం లేదు. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. అమెరికాలో జతకూర్చిన సమాచారం ప్రకారం ఒక్క రోజులో ఎస్ అండ్ పి 500 సూచిక 1.66 శాతం పతనంతో ఒక లక్ష కోట్ల డాలర్లు, నాస్‌డాక్ 2.09 శాతం పతనంతో ఆరు వందల బిలియన్ డాలర్లు, డౌ సూచిక 1.2 శాతం పతనం 300 బి. డాలర్లు మొత్తం ఒక్క రోజులో 1.2 లక్షల కోట్ల డాలర్లు ఆవిరైంది. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. అమెరికాలో ఉత్పత్తి అయ్యే డబ్ల్యుటిఐ రకం ముడి చమురు ధర 2025 డిసెంబరులో 57 డాలర్లు ఉంటే ఇది రాసిన సమయంలో 102 డాలర్లు ఉంది. దీనికి అనుగుణంగానే అమెరికాలో ధరలు పెరిగాయి. ఫిబ్రవరిలో విమాన ఇంధనం పీపా ధర 99 డాలర్లు ఉంటే మార్చి నెల 20న 197 డాలర్లకు పెరిగింది. స్లోక్ అనే ఆర్థికవేత్త జనవరిలో అమెరికా ఆర్థిక స్థితి గురించి ఆశాభావం వెలిబుచ్చాడు. ఎప్పుడైతే ట్రంప్ యుద్ధాన్ని ప్రారంభించాడో ఇప్పుడా పెద్దమనిషి స్టాగ్‌ఫ్లేషన్ అవకాశాల గురించి హెచ్చరించాడు. ముందే చెప్పుకున్నట్లు డోనాల్డ్ ట్రంప్ అనుకున్నది ఒకటి. జరుగుతున్నది మరొకటి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు. పెట్రో డాలర్‌ను సవాలు చేస్తూ చైనా యువాన్‌తో లావాదేవీలు జరిపేవారి నౌకలను హార్ముజ్ జలసంధి నుంచి అనుమతిస్తామని అది ప్రకటించింది. ఆ కరెన్సీలోనే అది కప్పం వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్ యుద్ధం చైనా పెట్రో యువాన్‌కు శక్తినిస్తుందని అమెరికా డాలర్ ఆధిపత్యం బలహీనపడుతుందని ఈ పరిణామాల గురించి హాంకాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్ పత్రిక వ్యాఖ్యానించింది. తర దేశాలను తన అదుపులో ఉంచుకొనేందుకు తనకు అనుగుణంగా ఆడించేందుకు ఉక్కిరి బిక్కిరి చేసే అంశాలుగా ప్రపంచంలోని చమురు సంపద, ఇతర వనరులను వినియోగించుకొనేందుకు వాటి మీద అదుపు సాధనకు అమెరికా ఎప్పుడో ఎత్తువేసింది. ఇప్పుడు అనూహ్యంగా గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ అదే పాత్ర పోషించాలని చూస్తోంది. సూయజ్ కాలువ ద్వారా మధ్యధరా సముద్రంలో ప్రవేశించిందేకు పర్షియా గల్ఫ్-ఎర్ర సముద్రాన్ని అనుసంధానం చేసే అల్ మండాబ్ జలసంధిని కూడా ఎమెన్ ద్వారా తన అదుపులోకి తెచ్చుకుంటామని హెచ్చరించింది.

## ప్రజలంతా గర్వించాల్సిన సమయమిది: రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమరావతి: తెలుగు ప్రజలందరికీ నేడు చరిత్రాత్మకమైన రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బిల్లును తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారని ఆయన చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారిందని.. నేడు ఆ లోటు భర్తీ కానుందని రామ్మోహన్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ విభజన జరిగిన తీరుకు తాము వ్యతిరేకమని.. రాజధాని బిల్లు ఎందుకు తెచ్చారనేది అందరూ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటికీ సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవాలని తమ నాయకుడు సీఎం చంద్రబాబు నేర్పించారని కేంద్ర మంత్రి అన్నారు. వాజ్‌పేయి హయాంలో 3 రాష్ట్రాల విభజన జరిగిందని.. ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులూ రాలేదన్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఏపీకి రాజధాని లేకుండా వదిలేయడంతోనే సమస్య మొదలైందన్నారు. ఆ సమయంలో ఏపీకి రూ.16 వేల కోట్ల రెవెన్యూ లోటు ఉందని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో చీకటి రోజులు ఉన్నాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించారని.. రాజధాని కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారని కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారని మండిపడ్డారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుందన్నారు. కృష్ణానది తీరంలో అమరావతి నిర్మించాలనేది ఏపీ ప్రభుత్వ నిర్ణయమని.. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా నిర్మాణం జరుగుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## ఆటో ఢీకొని ఇద్దరు దుర్మరణం



**చీరాల, పతాకం న్యూస్:** చీరాల మండలం విజయనగర కాలనీ సమీపంలోని వాడరేవు జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న ముగ్గురు వ్యక్తులపై వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. అందిన వివరాల మేరకు, విజయనగర కాలనీకి చెందిన తేళ్ళ పెద్ద లక్ష్మయ్య (68), రేణుమాల సుబ్బయ్య (60) మరియు చుండూరి వీరయ్య ముగ్గురు కలిసి ఉదయం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మయ్య సోషల్ వెల్ఫేర్ శాఖలో విశ్రాంతి ఉద్యోగి కాగా, సుబ్బయ్య హైవే అథారిటీలో ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ సమయంలో బాపట్లకు చెందిన గోపి అనే ఆటో డ్రైవర్ చిలకలూరిపేటలో మిరపకాయలు దించి పర్చూరు నుంచి చీరాల వైపు వేగంగా ప్రయాణిస్తూ ముగ్గురిపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో లక్ష్మయ్య, సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందగా, వీరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ సీఐ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఘటన స్థలంలో విలపించిన తీరు అందరినీ కలచివేసింది. ఈ ఘటనతో విజయనగర కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇదే ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, హైవే అధికారులు సరైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## మౌంట్ ఎవరెస్ట్‌లో భారీ మోసం.. వెలుగులోకి రూ. 167 కోట్ల దందా



**ఖాట్మండు :** ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం మౌంట్ ఎవరెస్ట్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయి బీమా మోసం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ. 167 కోట్ల మేరకు ఈ మోసం జరిగినట్లు 'ది ఖాట్మండు పోస్ట్' వెల్లడించింది. ఈ కేసులో ట్రెక్కింగ్ కంపెనీల యజమానులు, హెలికాప్టర్ ఆపరేటర్లు సహా 32 మందిపై నేపాల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం, గైడ్‌లు పర్యాటకుల ఆహారంలో బేకింగ్ సోడా కలిపి వారిని అనారోగ్యానికి గురిచేస్తున్నారు. దీంతో పర్యాటకులు తీవ్రమైన కడుపునొప్పి, జీర్ణ సమస్యలతో బాధపడుతూ ఖరీదైన హెలికాప్టర్ అత్యవసర సేవలను వినియోగించుకునేలా చేస్తున్నారు. ఈ పరిస్థితిని 'ఆల్టిట్యూడ్ సిక్‌నెస్'గా చూపించి అంతర్జాతీయ బీమా సంస్థల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పర్యాటకులను బలవంతంగా హెలికాప్టర్ అంబులెన్స్‌లలో ఎక్కించి, నకిలీ వైద్య, విమాన పత్రాలతో మోసం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. జనవరి 1న ప్రారంభమైన దర్యాప్తులో మూడు ప్రముఖ పర్వత రక్షణ సంస్థలకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులను అరెస్టు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

## అందరికీ అందుబాటులో అమరావతి: ఆనం



**నెల్లూరు, పతాకం న్యూస్:** నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడబోతోందని, తెలుగు ప్రజల ఏళ్ల నాటి కల, ఆశయం నెరవేరబోతున్నాయని మంత్రి ఆనం పేర్కొన్నారు. అంతేకాదు, ఐదేళ్ల పాలనపై విమర్శలు చేస్తూనే, రాష్ట్ర భవిష్యత్తుపై, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. 'తెలుగు ప్రజల దశాబ్దాల ఆశ, ఆకాంక్షలు నెరవేరే చరిత్రాత్మక రోజు ఇది. భారత పార్లమెంట్ వేదికగా, ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అధికారికంగా ఆమోదం పొందనుంది. గత ఐదేళ్ల కాలంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధాని విషయంలో 'మూడు ముక్కలాట' ఆడి ప్రజలను వంచించారు. జగన్ హయాంలో జరిగిన దుర్మార్గాల నుంచి, అస్తవ్యస్తమైన ఆర్థిక పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బలి కాకుండా కూటమి ప్రభుత్వం రక్షించింది' అని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు, బీసీ నేత ఆర్.కృష్ణయ్య అమరావతికి మద్దతు తెలుపుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'అమరావతి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన దూరంలో, అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతం. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు, బడుగు బలహీన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు కేంద్రం. గతంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన చంద్రబాబు నాయుడు, అదే తరహాలో అమరావతిని కూడా అద్భుతంగా అభివృద్ధి చేస్తారనే నమ్మకం నాకుంది' అని అన్నారు.

## గత వైసీపీ పాలనలో ఏపీలో విధ్వంసం: నిమ్మల




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** గత వైసీపీ పాలనలో ఏపీలో విధ్వంసం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు. గురువారం రాజమండ్రి కలెక్టరేట్‌లో జరిగిన తూర్పుగోదావరి జిల్లా బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విభజనతో జరిగిన నష్టం కంటే గత ఐదేళ్ల వైసీపీ పాలనతోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ మీదకు వెళ్లిందన్నారు. నాడు తాడేపల్లి, ఇడుపులపాయ ఖజానాలు నింపుకొని.. రాష్ట్ర ఖజానా లూటీ చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఖాళీ చిల్లుకుండ ఇచ్చి పోయారంటూ మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25లో జీఎస్‌డీపీ11.89 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. గత పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకుంటూనే, అభివృద్ధితో పాటు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామన్నారు. వేసవిలో గోదావరి డెల్టా ప్రధాన కాలువలలో సిల్టును తొలగించేందుకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. గోదావరి డెల్టా లైడార్ సర్వే పూర్తయిందని.. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేస్తామని చెప్పారు. ఈనెల 15 నాటికి గోదావరి డెల్టాకు రబీ సీజన్ పూర్తవుతుందన్నారు. అవసరమైతే రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని గోదావరి డెల్టా కాలువలకు సాగునీరు సరఫరా పొడిగిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## మధ్యాహ్నం భోజనం నిర్వాకులపై మంత్రి ఫరూక్ ఆగ్రహం



**నంద్యాల, పతాకం న్యూస్:** విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం గుడ్డు ఇవ్వకపోవడం పట్ల రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నంద్యాల స్థానిక ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్‌ను మంత్రి ఫరూక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి స్వయంగా భోజనం చేసిన మంత్రి ఫరూక్ , విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. మెనూ ప్రకారం గురువారం విద్యార్థులకు గుడ్డు వడ్డించకపోవడాన్ని గమనించిన మంత్రి ఫరూక్ , భోజన నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా వస్తున్న నీరు ఉప్పగా ఉండటంతో విద్యార్థులు తాగడానికి ఇబ్బంది పడుతున్నట్లు మంత్రి ఫరూక్ దృష్టికి రావడంతో దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. చాలా కాలంగా స్లాబ్ లెవల్‌లో ఆగిపోయిన నిర్మాణ పనుల వల్ల, అక్కడ ఉన్న కర్రలు ఎప్పుడు పడతాయోనని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై మంత్రి ఫరూక్ వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో లోపాలు, తాగునీరు భవన నిర్మాణ సమస్యలను వివరించి, యుద్ధ ప్రాతిపదికన వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

# అధ్వానంగా గిరిజన గ్రామాల రహదారులు!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కంచిలి మండలంలోని పలు గిరిజన గ్రామాలకు సరైన రోడ్లు లేవు. ఏ రోడ్డు చూసినా అధ్వానంగా ఉంటుంది. రాళ్లు తేలి గోతులతో దర్శనమిస్తోన్నాయి. కనీసం వాటిపై నడవలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నువ్వాగడ, తుత్తాసాయి, సంబరమొర తదితర గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. జలంత్రకోట నుంచి నువ్వాగడ వెళ్లే తారురోడ్డు పూర్తిగా రాళ్లు తేలి భయానకంగా మారింది. నువ్వాగడ ఆశ్రమ పాఠశాల నుంచి సంబర మొర, గోపకేళి గ్రామాలకు వెళ్లే రహదారి సైతం గోతులమయమైంది. సరైన రోడ్లు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా, ఆందోళనలు చేసినా సంబంధిత అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల గొల్లకంచిలి నుంచి బొగాబెణి వరకు, బొగాబెణి నుంచి గోపకేళి వరకు నూతన రహదారి నిర్మించారు. మిగిలిన గిరిజన గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన రైతులు




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరపల్లి మండలంలో ఉండేటటువంటి గిరిజన పోడు సాగు దారులు ఎవరైతే ఉన్నారో గత 35 సంవత్సరాల నుంచి సాగు చేసే పోడు రైతులకు సాగు పట్ట మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కి మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి. టీ.దొర మాట్లాడుతూ దేవరపల్లి మండలంలోని చింతలపూడి, తామరబ్బా,గరిసింగి,వాలాబు, వెంకటరాజపురం,ఇలాంటి పంచాయతీలలో పోడు చేసే సాగుదారులు గిరిజనులు ఉన్నారని వారుకు పట్టాలు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రెవెన్యూ సదస్సుల పేరుతో సమస్యలన్నీ వినతి పత్రాలు ద్వారా ప్రభుత్వానికి రెవెన్యూ డిపార్ట్మెంట్ ద్వారా అందజేయడం జరిగింది. బంజరి,పోడు పట్టాల కోసం సాగు చేస్తున్నా రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ వెంటనే ఆదివాసి గిరిజన సమస్యలు పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో చెరుకు శ్రీను, జోగులు, కంచర పెద్ద గంగరాజు, చెరుకు రాజు, పోయిరా దేవుడు, మొదల గిరిజనులు పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్ ముందు ఆందోళన చేశారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది కపట ప్రేమ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రభుత్వ రంగంలోని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమ చూపిస్తున్నాయని, ప్రైవేట్ రంగం పట్ల ప్రేమ చూపిస్తూ, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మిక,ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ, ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెఏసి ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మిక ప్రజా సంఘాలు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవన్నారు. జి ఎస్ టి రాయితీలు లేవన్నారు. వాటర్ రాయితీ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ లో తొమ్మిది వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, స్టీల్ ప్లాంట్ పై సుమారు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాల పాటు లాభాలలో నడిచిన స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నిర్ణయించిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ, కార్మికులు ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇదే సందర్భంలో అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆర్ సి ఎల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రా మెటీరియల్ గ్యారెంటీ ఇచ్చాయన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ చెల్లించిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల వరకు వాటర్ పై పన్ను లేదన్నారు. 15 సంవత్సరాల పాటు పూర్తి రాయితీ ఎలక్ట్రిసిటీ కల్పిస్తున్నారు. 2.9 కిలోమీటర్ల వరకు క్యాపిటల్ పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. ప్రైవేటు మిట్టల్ పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ రంగం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మార్చుకొని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ టియు జాతీయ అధ్యక్షుడు ఎన్. కనకరావు, సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగా రావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, అధ్యక్షులు కె.ఎం శ్రీనివాస్,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుత్ రావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,స్టీల్ ప్లాంట్ సిఐటియు యూనియన్ నాయకులు అయోధ్య రామ్,ఎన్.రామస్వామి,ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం,ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,వైఎస్ఆర్ టియుసి యూనియన్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ జిల్లా కలెక్టర్‌గా
## అభిషిక్త్ కిషోర్ బాధ్యతల స్వీకరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా ఎం.అభిషిక్త్‌కిషోర్ బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌కు చేరుకున్న నూతన కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరీ, జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తదితరులు కలెక్టరేట్‌కు స్వాగతం పలికారు. విశాఖ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పనిచేస్తా విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కంకణబద్ధుడినై పనిచేస్తానని, ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన ఛాంబర్లఓ ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధి తన ప్రాధాన్యతగా ఉంటుందని స్పష్టం చేశారు. విశాఖపట్నం రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశానికి కూడా కీలకమైన ఆర్థిక, పారిశ్రామిక, ఐటి కేంద్రంగా అభివృద్ధి చెందే నగరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐటి, పరిశ్రమలు, డేటా సెంటర్లు, టూరిజం రంగాల్లో మరింత పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తానని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం, పోర్టు ఆధారిత అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలు విశాఖపట్నం అభివృద్ధికి కొత్త దిశను తీసుకొస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని జిల్లాను రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, అందరూ కలిసి విశాఖపట్నాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తాను ఆంధ్రావాడినేనని, తన స్వస్థలం నెల్లూరు అని, అమ్మానాన్నా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే అని కలెక్టర్ తెలిపారు. తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో సబ్ కలెక్టర్‌గా, ఐటిడిఎ పిఒగా, మున్సిపల్ కమిషనర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పని చేసినట్లు వివరించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా, ఫైనాన్స్, కమర్షియల్ టాక్స్, ఇండిస్ట్రీస్ విభాగాల్లో సేవలందించానని చెప్పారు. విశాఖ జిల్లాకు రావటం ఆనందంగా ఉందన్నారు.

## ఆదివాసీలకు తప్పని డోలి మోతలు



**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజనులకు సరైన రవాణా రహదారి సౌకర్యం లేక డోలి మోతల కష్టాలు తప్పడం లేదు. అల్లూరి జిల్లా డుంబ్రిగడ మండలంలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు కొల్లాపూటు పంచాయతీ డోకిరిపాడు గ్రామానికి చెందిన గర్భిణి డొమినికి ఉదయం ప్రసవ పురిటి నొప్పులు వచ్చాయి. ఆస్పత్రికి తరలించడానికి రోడ్డు లేక 108 అంబులెన్స్ వచ్చే అవకాశం లేకపోవడంతో గ్రామస్తులు, గర్భిణి కుటుంబీకులు ఆమెను డోలీ సహాయంతో సుమారు మూడు కిలోమీటర్లు దూరం బొడ్లమామిడి రోడ్డు జంక్షన్ వరకు మోసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రైవేట్ ఆటోలో ఆస్పత్రికి తరలించామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించి డోలీ మోత కష్టాలు తీర్చాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధితులకు మొబైల్ ఫోన్ల అందజేత

**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లా పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా పనిచేస్తోందని, ఇందులో భాగంగా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళాను విజయవంతంగా నిర్వహించామని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 29వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 5వ తేదీ వరకు బాధితులు పోగొట్టుకున్న రూ 7 లక్షల విలువైన 65 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ అమిత్ బర్దార్ స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం అల్లూరి జిల్లాలోనే కాకుండా పొరుగు జిల్లాలైన తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ, ఖమ్మం తదితర జిల్లాలతో పాటు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా 65 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ యంత్రాంగం రికవరీ చేసిందన్నారు. రికవరీ మేళాలో బాధితుల కళ్లల్లో ఆనందం చూడడం సంతృప్తినిచ్చిందన్నారు. మొబైల్ పోయినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు.

### అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై
## టీడీపీ కార్యాలయంలో సంబరాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంబరాలు మిన్నంటాయి. రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై తెలుగుదేశం పార్టీ నేతలు హర్షం తెలుపుతూ కేక్ కట్ చేసి తినిపించుకొన్నారు, అనంతరం టపాసులు బాణాసంచా కాల్చుకొని జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ ఆనంద ఉత్సవాలు జరుపుకున్నారు. అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించినందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వ కార్యదర్శి కోరాడ రాజబాబు,పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి పుచ్చ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ గొల్ల గాని వీర రావు బుజ్జి, రాష్ట్ర తెలుగు యూవత అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు సీఎం రమణ, మల్ల రవికుమార్, కార్యాలయ కార్యదర్శి బండారు అప్పారావు,నక్క కనకరాజు, విల్లూరి చక్రవర్తి, చెట్టు గోపి, బోట్ట వెంకటరమణ, పెలి శెట్టి అప్పన్న, దాసన్న సత్యనారాయణ,గుంప గిరిధర్,వానపల్లి రామ్ కుమార్, సనపల కీర్తి, పి జయరాజ్ జాన్, అల్లూరి సత్యనారాయణ రెడ్డి, కేదారి లక్ష్మి , గనగళ్ళ సత్య, అబ్దుల్ అనీఫ్, తోట శ్రీదేవి, బొడ్డేపల్లి లలిత, శ్రీవిద్య, ముక్త రాజారావు, చుక్క జోగారావు, షేక్ రంతుల్లా, పి లక్ష్మీ శివప్రసాద్, మైలపల్లి శ్రీనివాసరావు, ఊరుకుట్టి గణేష్, మహమ్మద్ గౌస్, లక్ష్మీ లావణ్య, శ్రీ, సౌజన్య, లక్ష్మీ భార్గవి, రాధా బాయ్, అప్పలరాజు, రంజిత్, తాడి వెంకట కుమారి, పైడివాడ శ్రీనివాసరావు, అసప్రియ,తదితరులు పాల్గొన్నార.

## ఉపాధ్యాయులకు బిఎల్ఎస్, సిపిఆర్‌పై శిక్షణ




**మల్కాపురం, పతాకం న్యూస్ :** కోరమండల్ సంస్థ మరియు అపోలో హాస్పిటల్స్ సంయుక్తంగా మల్కాపురం పాఠశాల ఉపాధ్యాయులకు ప్రాణరక్షణ నైపుణ్యాలైన బిఎల్ఎస్ మరియు సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చాయి. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడటంలో సిపిఆర్ కీలకమని మండల విద్యాధికారి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు ఉపాధ్యాయులు మ్యానెక్విన్‌లపై స్వయంగా సిపిఆర్ అభ్యాసం చేసి, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని పొందారు. గుండెపోటు గుర్తింపు, హైమ్లిచ్ విన్యాసం, ప్రథమ చికిత్స మరియు ఏఈడీ పరికరం వాడకం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు మరియు పాఠశాలలకు ప్రథమ చికిత్స కిట్‌లను పంపిణీ చేసి, సురక్షితమైన పాఠశాల వాతావరణానికి బాటలు వేశారు.

## ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గల విద్యాలయాలకు విద్యుత్ వెలుగులు



**పాడేరు, పతాకం న్యూస్:** ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గల ప్రాథమిక పాఠశాలలకు చీకట్లు తొలిగాయి. సుమారు యాభై ఏళ్లుగా విద్యుత్ సదుపాయానికి నోచుకోని పాఠశాలల్లో ఇప్పుడు వెలుగులు విరజిమ్ముతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలకు విద్యుత్ సదుపాయం ఉండడం సహజం. అయితే ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలకు సైతం విద్యుత్ సదుపాయం కల్పించడం విశేషం. విద్యాభివృద్ధిలో భాగంగా ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 93 ప్రాథమిక పాఠశాలలకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. ఇందుకు గాను ఒక్కో పాఠశాలకు రూ. 1.5 లక్షలు ఖర్చు చేశారు. ఏజెన్సీలో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి సుమారుగా 50 ఏళ్లు కావస్తున్నది. అయితే అప్పటి నుంచి వాటికి ఎటువంటి విద్యుత్ సదుపాయం లేదు. దీంతో వాతావరణానికి అనుగుణంగా ఎండ కాస్తే గదుల్లో వెలుతురు, మబ్బులు పడితే చీకటి అన్నట్లుగానే ఉండేది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మారుమూలనున్న ప్రాథమిక పాఠశాలలకు సైతం విద్యుత్ సదుపాయం కల్పించడంపై ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నాళ్లకు తమ బడులకు వెలుగులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎంపిక చేసిన 93 ప్రాథమిక పాఠశాలలకు సమగ్ర శిక్ష అధికారులు విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. ఉమ్మడి జిల్లాలో అడ్డతీగలలో 9, అరకులోయలో 10, చింతపల్లిలో 15, దేవీపట్నంలో 1, డుంబ్రిగుడలో 4, జీకేవీధిలో 16, గంగవరంలో 1, కొయ్యూరులో 7, మారేడుమిల్లిలో 4, ముంచంగిపుట్టులో 4, పెదబయలులో 17, రంపచోడవరంలో 4, వై.రామవరంలో 1 చొప్పున మొత్తం 93 పాఠశాలలు విద్యుత్ సదుపాయానికి నోచుకున్నాయి.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..




**విజయనగరం, పతాకం న్యూస్:** కేంద్రప్రభుత్వం ఏప్రిల్ 1 తేదీ నుంచి అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన జిల్లా అంతటా పలు రంగాల కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి బ్లాక్‌డే పాటించారు. ఏప్రిల్ 1 బ్లాక్ డేగా పాటించాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు స్థానిక కోట జంక్షన్ వద్ద కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి అప్పలరాజు, ఐఎఫ్‌టియు నాయకులు అప్పలసూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 తేదీ నుంచి అమలలోకి తీసుకొచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటలు పని దినం, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలు కాకుండా చేయడమే లేబర్ కోడ్ లు ప్రధాన ఉద్దేశమన్నారు లేబర్ కోడ్‌లు కార్పొరేట్ దోపిడీదారులకు అనుకూలించే విధానంగా అమలు చేస్తుందన్నారు. లేబర్ కోడ్ లు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహనరావు, వి.లక్ష్మి, బి.సుధారాణి, బి.రమణ కార్మికులు పాల్గొన్నారు. విజయనగరం కోట జంక్షన్ వద్ద సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యాన జరిగిన నిరసనలో సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు, ఎ.జగన్మోహనరావు, బి.రమణ మాట్లాడారు. . లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## సిరిమానోత్సవాలకు సౌకర్యాలు కల్పించండి



**బొబ్బిలి, పతాకం న్యూస్:** బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి, పాత బొబ్బిలి సరేపోలమ్మ సిరిమానోత్సవాలు ఈ నెలాఖరున జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగనీయవద్దని ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సాయంత్రం ఆయన తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, సిరిమానుల ఊరే గింపు జరిగే రహదారులన్నీ సక్రమంగా ఉం చాలన్నారు. మరమ్మతులు అవసరమైతే చేపట్టాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా భోజరాజపురం మున్సిపల్ ప్రధాన వాటర్‌వర్క్స్ నుంచి ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం తాగునీటిని రిజర్వా యర్లకు పంపింగ్ జరిగేలా పగడ్బ దీగా చర్యలు చేపట్టాల న్నారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి వేగావతినదిలోనికి నీటిని విడుదల చేయాలని జిల్లా అధికారులను ఇప్పటికే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, డీఈఈ పెదిరెడ్ల కిరణ్ కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

## ఆర్థిక బకాయిలు చెల్లించాలి



**టతీ, పతాకం న్యూస్:** 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి ఆర్థిక బకాయిలను చెల్లించాలని, 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఆర్థిక సమస్యల పరిష్కారానికి రూట్ మ్యాప్ ప్రకటించాలని తదితర డిమాండ్లతో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దిలే దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించని ఎడల ఈ నెల 28వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని, అందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విశాఖ జిల్లా జెఎసి చైర్మన్ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ, ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల పెన్షనర్ల ఆర్థికపరమైన డిమాండ్ల సాధనకు పెద్ద ఉద్యమం నిర్మిస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, 12వ వేతనసవరణ కమిషన్‌ను జాప్యం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఇహెచ్‌ఎస్ సమస్యలును పరిష్కరించాలని, 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఉద్యోగులకు మెమో 57ను అమలు చేస్తూ పాత పెన్షన్ అమలు చేయాలని, కోవిడ్ సమయంలో చనిపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల పిల్లలకు కారణ్య నియమకాలు చేపట్టాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులకు రెగ్యులర్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు కె.ముత్యాలనాయుడు, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, ఎం రామకృష్ణ, వి.రామలక్ష్మి, శ్రీనివాసరావు, సంతోష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరికి అందించారు. అనకాపల్లి : 12వ పిఆర్సీ అమలు, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెండింగ్ డిఏల విడుదల, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం అనకాపల్లి పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బారు మాట్లాడుతూ 11వ పిఆర్‌సి గడువు ముగిసి మూడేళ్లు కావస్తున్నా, ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం, కాలయాపన చేస్తుందన్నారు. ఈ డిమాండ్‌పై ఈ నెల 28వ తేదీన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలు ప్రభుత్వం కేవలం రూ.9 వేల కోట్లు చెల్లించి చేతులు దులుపుకుందని, ఇంకా రూ.30 వేల కోట్ల బకాయిల చెల్లింపులపై స్పష్టత లేదని పేర్కొన్నారు.

# ఈ విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ తరగతులు ప్రారంభించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కోటబొమ్మాళి మండలానికి డిగ్రీ కళాశాల మంజూ రైనందున ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. కలెక్టర్ స్విప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాత్కాలి కంగా స్థానిక జూనియర్ కళాశాల భవనాల్లోనే తరగతులు కొనసాగించాల న్నారు. కొత్త భవనాలు నిర్మించేందుకు 3.5 ఎకరాలు గుర్తించడం జరిగిందని, వాటిలో నూతన భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. అంతవరకు జూని యర్ కళాశాల భవనాల్లోనే తాత్కాలికంగా డిగ్రీ తరగతులు నిర్వహించాలని సూచించారు. నాలుగు విభాగాల్లో కోర్సులు ఉన్నాయని, మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉంటాయని మంత్రికి ప్రిన్సిపాల్ గోవిందమ్మ వివరించారు. అన్ని సీట్లు భర్తీ అయ్యేలా అధ్యాపకులు కృషి చేయాలని మంత్రి సూచించారు. డిగ్రీ చదివేందుకు సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల విద్యార్థులు టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం వెళ్లాల్సి వచ్చేదని ఇక నుంచి ఆ ఇబ్బంది ఉండదని మంత్రి వివరించారు. సమావేశంలో టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, తహసీల్దార్ ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ పాల్గొన్నారు.

## ఆరోగ్యంపట్ల జర్నలిస్టులు శ్రద్ధ వహించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పాత్రికేయులంతా తమ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు గత ఐదు రోజులుగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని, కలెక్టర్ సందర్శించారు. పాత్రికేయులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు గురించి తెలుసుకున్నారు. తాను కూడా స్వయంగా బిపి, షుగర్ తదితర పరీక్షలను చేయించుకున్నారు. పాత్రికేయులకు రిపోర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పని ఒత్తిడిలో పడి జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని విస్మరించడం సరికాదని అన్నారు. తమతోపాటు, తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా మధ్య వయసు వచ్చిన వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి వైద్య పరిక్షల కారణంగా శరీరంలో దాగిఉన్న ఆనారోగ్య లక్షణాలను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరాన్ని జర్నలిస్టులంతా ఉపయోగించుకొని, తమతోపాటు, కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు చేయించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సమాచార శాఖ ఎడి పి.గోవిందరాజులు మాట్లాడుతూ ఇప్పటివరకు 141 మంది జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిపి 362 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, సుమారు 120 మందికి పరీక్షలు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రతీఒక్కరూ జర్నలిస్టు హెల్త్‌కార్డును పొందాలని సూచించారు. తిరుమల మెడికవర్ ఎండి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ, నిత్యం పనిఒత్తిడితో సతమతం అయ్యే జర్నలిస్టులు, తమ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ జీవనరాణి, ఎన్‌టిఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ సాయిరాం, తిరుమల మెడికవర్ సెంటర్ హెడ్ పవన్‌కుమార్, ఐసియు ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.జగదీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీకిరణ్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జగన్ ఇంకా అమరావతిపై విషం చిమ్ముతున్నారు: మంత్రి నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిపై జగన్ ఇంకా విషం చిమ్ముతున్నారని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మావిగన్ అనేది పిచ్చి ప్రతిపాదన అని అన్నారు. ప్రజల్ని గందరగోళ పరచడమే జగన్ ఎజెండా అని మంత్రి నారాయణ మండిపడ్డారు. ఉద్దండరాయునిపాలెంలో అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. అమరావతికి చట్టబద్ధత లభించినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. రాజధాని రైతుల పోరాటం నేడు ఫలించిందని తెలిపారు. 11 సీట్లకు జగన్ పరిమితమైనా మార్పు రాలేదని విమర్శించారు. ఇప్పటికీ అమరావతి పేరు పలకటానికి జగన్ ఇష్టపడట్లేదని మండిపడ్డారు. జగన్ మావిగన్ అంటే చిన్నపిల్లల సైతం నవ్వుకుంటున్నారన్నారు. కేంద్రం చేసే చట్టాలు రాష్ట్రాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన వారు తాము మారుస్తామంటే కుదరదని అన్నారు. ఇక అమరావతిని కదిలించడం ఎవరివల్లా కాదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. "జగన్‌కు మతి స్థిమితం ఉందో లేదో నాకు తెలియట్లేదు. ఎందుకంటే లోక్‌సభ అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో ప్రవేశపెట్టారు. బిల్లు ఆమోదం అవుతుంది మెజార్టీ ఉంది. ఈ సమయంలో జగన్ వ్యాఖ్యలు చేయడం సరికాదు. అమరావతికి చట్టబద్ధత రావటంతో అనుమానాలు తొలిగాయి. రైతుల కోరిక మేరకు చట్టబద్ధత కోసం సీఎం కృషి చేశారు. జగన్ ఇంకా అమరావతిపై విషం చిమ్ముతున్నారు. మావిగన్ అనేది పిచ్చి ప్రతిపాదన. ప్రజల్ని గందరగోళ పరచడమే జగన్ ఎజెండా." – అని మంత్రి నారాయణ తెలిపారు.

## బొత్స వాస్తవాలు గ్రహించాలి: కిమిడి




**చీపురుపల్లి, పతాకం న్యూస్:** అవాకులు చవాకులు మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స అండ్ పార్టీ ఇకనైనా, వాస్తవాలు గ్రహించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు హితవుపలికారు. రాష్ట్రంలో జరుగు తున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి, ఓర్వలేక వైసీపీ నాయకులు గుండెలు బాదుకుంటున్నారని పేర్కొనారు. అమరావతి రాజధానికి చట్ట భద్రత కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. చీపురుపల్లిలో కళా వెంకటరావు విలేకరులతో మాట్లాడారు. మూలపేట పోర్టు పనులు గత ప్రభుత్వం హయాంలో కేవలం 30 శాతం మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. అనకాపల్లిలో స్టీల్‌ప్లాంట్, భోగాపురం ఎయిర్ పోర్టు, విశాఖపట్నంలో 90వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల వల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

## ఆక్వా యూనివర్సిటీకి మంచి రోజులు



**భీమవరం, పతాకం న్యూస్:** ఆక్వా విశ్వవిద్యాలయానికి మంచి రోజులు రానున్నాయి. బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. త్వర లోనే వాటిని విడుదల చేయనుంది. ఇక విశ్వవిద్యాలయ శాశ్వత క్యాంపస్ సిద్ధం కానుంది. బిల్లులు మంజూరు చేయడం లేదన్న ఉద్దేశంతో పునాదుల వద్దే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఇంజనీరింగ్ అధికారులు ఎంతగా సంప్రదిస్తున్నా సరే స్పందన లేదు. వచ్చే ఏడాది అమలయ్యే బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ఆశలు చిగురించాయి. గత ప్రభుత్వంలో నరసాపురానికి ఆక్వా విశ్వవిద్యాలయం మంజూరు చేశారు. పేదల ఇళ్ల కోసం కొనుగోలు చేసిన స్థలాన్ని కేటాయించారు. వాస్తవానికి అక్కడ ఉన్న 54 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మించాల్సి వుంది. భూమి అనుకూలంగా లేదంటూ తేల్చడంతో పాలకొల్లు నియోజకవర్గానికి ప్రభుత్వ వైద్య కళాశాలను తరలించారు. ఇక నరసాపురంలో కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్వా విశ్వ విద్యాలయానికి కేటాయించారు. అప్పట్లో పనులు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. పునాదుల వద్దే పనులు నిలిచిపోయాయి. తుఫాను భాధితుల సంరక్షణ కేంద్రంలోనే తరగతులు నిర్వహిస్తూ వచ్చారు. దాని వల్ల విద్యార్థులు ఇబ్బందులు చెప్పడానికి వీలు లేదు. నానా తంటాలు పడ్డారు. కనీసం హాస్టల్ వసతి కూడా లేదు. తరగతుల నిర్వహణకు సరైన వసతి లేదు. తాత్కాలిక క్యాంపస్ నిర్వహించడానికి స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ముందు కొచ్చినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పెద్దగా స్పందించ లేదు. ఆక్వా విశ్వవిద్యాలయంలో చేరిన విద్యార్థులను గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వర్ణాంధ్ర కళాశాలలో తాత్కాలిక క్యాంపస్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతం స్వర్ణాంధ్రలోనే ల్యాబ్‌లు, గ్రంథా లయం, హాస్టల్ వసతి సమకూరింది. ఉండిలో ఉన్న మత్స్య పరిశోధనా కేంద్రంలో ప్రయోగాలు చేస్తున్నారు. అక్కడకు వెళ్లి రావడానికి ప్రభుత్వం బస్సు సౌకర్యాన్ని సమకూర్చింది. అయితే శాశ్వత క్యాంపస్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. అప్పుడే ఆక్వా విశ్వవిద్యాలయ ఫలితాలు పూర్తిస్థాయిలో అందు బాటు లోకి వస్తాయి. ఆక్వా సాగుకు సమర్థవంతమైన నిపుణులను అందించేందుకు అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఆక్వా విశ్వవిద్యాలయం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం వృద్ధి చేసుకున్నారు. తీర ప్రాంతంలో వైసీపీ నేతలు ఆక్వా చెరువులను అభివృద్ధి చేసుకున్నారు తప్ప విశ్వ విద్యాలయాన్ని పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వ హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతే విశ్వవిద్యాలయంపై దృష్టి పెట్టారు. తాత్కాలికంగా విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపారు. శాశ్వత క్యాంపస్ కోసం నిధులు కేటాయించారు. అసరమనుకుంటే మరిన్ని నిధులను పెంచాలి. విశ్వ విద్యాలయ క్యాంపస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

## టూరిజం అభివృద్ధికి తోడ్పాటు



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి రవా ణా శాఖ తోడ్పాటు తప్పక అందిస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో రవాణాశాఖ ఉన్నతాధికారులు అఖిలభారత పర్యాటక బస్సు యజమానుల సంఘం సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రోత్సాహంగా ఇతర రాష్ట్రాలలో నమోదైన 700 నుండి 800 బస్సులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస న్కునేలా బస్సు యజ మానులను ప్రోత్సహిం చడానికి తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం త్రైమాసిక టాక్స్‌లో ఒక్కొక్క సీటుకు రూ.4వేల నుంచి రూ.2500 కు తగ్గిస్తున్నట్లు హామీనిచ్చారు. ఈ చర్య వల్ల బస్సు యజమానులతో పాటు ప్రయా ణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. బస్సుల ఫిట్ నెస్ నిర్ధారించడానికి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం ప్రమాదాలను నియం త్రించి భద్రత వ్యవస్థ ప్రతిష్టం చేస్తామన్నారు. సమస్యల పరి ష్కారానికి సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుంద న్నారు. ఎఐటిపి బస్సు నివాగులను ప్రోత్సహిం చడానికి పనిచేస్తుందని హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటి. కృష్ణబాబు, రవాణాశాఖ కమిషనర్ మనీషకుమార్ సిన్హా, భారత అఖిలభారత పర్యా టక బస్సుల యజమానుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.ఎంపిపి స్కూల్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ నాణ్యమైన పౌష్టిగా ఆహారం అందించాలనే సంకల్పంతో సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో అధికారులు, వంటఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్నం భోజనం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు, జయచంద్ర, పాఠశాల ఉపాధ్యా యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పీఆర్సీ అమలులో జాప్యం తగదు : యుటిఎఫ్




**కడప, పతాకం న్యూస్:** ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్ హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపా ధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. పిఆర్‌సి గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు అయిందని, అయినప్పటికీ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటులో తాత్సారం చేస్తుందని విమర్శించారు. పిఆర్‌సి అమలుకు నోచుకోక పోవడం వల్ల విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పంది ంచకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తా మని, అవసరమైతే సెక్రటేరియట్ ముట్టడి చేపడ తామని హెచ్చరించారు. ఎపి జెఎసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యా యులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సిని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. యు టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రతిప క్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికార పక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. సిఐటి యు అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు కె.శ్రీ నివాసులురెడ్డి, బి.మనోహర్, ఎల్ఐసి డివిజన్ కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు బి.రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం సాగిస్తున్న యుటిఎఫ్ దీక్షలకు తాము పూర్తి సంఘీభావం, మద్దతు తెలియ జేస్తున్నామన్నారు. ఎపి జెఎసి, ఎపి ఎన్‌జిఒ, పెన్షనర్స్ అసోసి యేషన్, ఎలక్ట్రికల్, ట్రెజరీ శాఖలు సంఘాల నాయకులు దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలి యజేశారు. 150 మంది ఉపాధ్యా యులు దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పాల్గొన్నారు. దీక్షలు విరమణ.. కడప సిటిజన్ ఫోరం నాయకులు ప్రముఖ వైద్యులు రాజావెంగళ్ రెడ్డి, పిళ్ళా కుమారస్వామి, రిటైర్డ్ డిపూటీ డిఇఒ నాగ మునిరెడ్డి, ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి నిమ్మరసం అందజేసి దీక్షలను విరమింపజేశారు. దీక్షల అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి విజయ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీక్షలకు వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సజ్జల రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి మద్దతు పలికారు.

## జీవో 198 రద్దు చేయాలి

**విజయవాడ, పతాకం న్యూస్:**పట్టణాల్లో ఆస్తిపన్ను పెంపును నిలిపివేయాలని, జిఒ 198 రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టణాల్లో అద్దె విలువ ఆధారిత ఇంటి పన్ను (ఆస్తి పన్ను) స్థానంలో ఆస్తి విలువ ఆధారిత పన్ను (క్యాపిటల్ వాల్యూ) విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకు చట్ట సవరణ (44/2020) చేసి జిఒ నంబర్ 198 విడుదల చేసిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 2021-22 సంవత్సరం నుండి ప్రతి ఏడాది 15 శాతం చొప్పున పన్ను పెంచుకుంటూ పోతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని సమీక్షిస్తామని టిడిపి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా పన్ను విధానాన్ని రద్దు చేయలేదని విమర్శించారు.

# శరవేగంగా జలగలగెడ్డ రహదారి పనులు




**చింతపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని లంబసింగి పంచాయతీ జలగలగెడ్డ గ్రామస్థుల కష్టాలు తీరనున్నాయి. రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్న గిరిజనులకు ఉపశమనం లభించనుంది. ఈ రహదారి నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో వారం రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు శరవేగంగా పనులు సాగుతున్నాయి. లంబసింగికి అతి సమీపంలో ఉన్న జలగలగెడ్డ గ్రామంలో ఆదిమజాతి ఆదివాసీలు నివాసముంటున్నారు. సుమారు యాభై ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామానికి కాలిబాట మినహా కనీస రహదారి సదుపాయం లేదు. స్థానిక గిరిజనులు పొరుగు గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రోగులు, గర్భిణులను డోలీపై ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితి. గ్రామానికి అధికారులు, పాలకులు ఏనాడూ వచ్చిన సందర్భాలు లేవు. తమ గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ ఫలితం దక్కలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, పాలకుల చుట్టూ రహదారి కోసం కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం లంబసింగి నుంచి జలగలగెడ్డ గ్రామానికి 670 మీటర్లు మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖకు అప్పగించడంతో వెనువెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. అయితే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లంబసింగి జంక్షన్ గిరిజనుల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ రహదారి నిర్మాణంలో తమ జిరాయితీ సాగు భూములు కోల్పోవాల్సి వస్తుందని లంబసింగి జంక్షన్ గిరిజనులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఏడాది కాలంగా ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు. కూటమి ప్రభుత్వం తమ గ్రామానికి తారు రోడ్డు నిర్మించేందుకు నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడంలేదని ప్రశ్నిస్తూ జలగలగెడ్డ గిరిజనులు పాడేరులో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో గత కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ జోక్యం చేసుకుని రహదారి నిర్మాణాలకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న లంబసింగి జంక్షన్ గిరిజన మహిళలతో చర్చించారు. రహదారి నిర్మాణంలో నష్టపోతున్న భూములకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో రహదారి నిర్మాణాలకు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు గత నెల 25న రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. కేవలం ఆరు రోజుల్లోనే లంబసింగి నుంచి జలగలగెడ్డ వరకు ఎర్తువర్క్ పూర్తి చేశారు. ప్రస్తుతం గ్రామం వరకు వాహనాలు నిరాటంకంగా వెళుతున్నాయి. మరో పది రోజుల్లో మెటల్, వెట్‌మిక్స్ రోలింగ్ చేస్తామని, నెలాఖరు నాటికి తారు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తామని గిరిజన సంక్షేమశాఖ డీఈఈ జి.రఘునాథరావునాయుడు తెలిపారు. కాగా జలగలగెడ్డ గ్రామానికి రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంతో స్థానిక గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# యథేచ్ఛగా ఆర్వో ప్లాంట్లు.. నీటి నాణ్యతపై అనుమానాలు?



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** పాలే కాదు.. నీళ్ల వ్యాపారంపైనా పర్యవేక్షణ కరవువైంది. కల్తీ పాల ఘటనలో గడిచిన 2 నెలల్లో 17 మంది మృతి చెందిన విషయం విధితమే. మరో ఇద్దరు చిన్నారులు ఇప్పటికీ డయాల్సిస్, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. గత నెలలో శ్రీకాకుళంలో డయేరియాతో ఇద్దరు మృతి చెందారు. ఇటువంటి ఉదాహరణలు పాలు, నీటి సరఫరాపై అధికార యంత్రాంగం బాధ్యతను మరింత గుర్తు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ప్యాకేజి డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వేసవి నేపథ్యంలో మరిన్ని ఏర్పాటుకు రంగం సిద్ధమవుతున్నాయి. అయితే అత్యధిక మంది స్వచ్ఛంధ సంస్థల పేరుతో ఏర్పాటు చేసి యథేచ్ఛగా నీటి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. మరి కొందరు వ్యాపారులు బోరు నీటినే విక్రయిస్తున్నారు. కలుషిత జలాలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో సుమారు 3 లక్షలకు పైగా కుటుంబాలు క్యాన్లలో మినరల్ నీటినే వినియోగిస్తున్నారు. నీటికోసం సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్లాంట్‌ల యజమానులకు ఒక్కో 20 లీటర్ల క్యాన్ నీటి తయారీకి రవాణా ఖర్చులతో కలిపి రూ.6 కంటే ఎక్కువ కావడం లేదు. వినియోగదారులకు మాత్రం రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తూ దోచుకుంటున్నారు. 200 మి.లీ. వాటర్ ప్యాకెట్లు తయారు చేసి.రూ.2 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిపై తయారీ తేదీ ముద్రిచటం లేదు. కేవలం శుద్ధి చేసిన నీరు అనే నమ్మకంతో వినియోగదారులు వీటిని వాడుతున్నారు.కొన్నింటికే అనుమతులుజిల్లాలో సుమారు 680కి పైగా ఆర్ఒ ప్లాంట్స్ ఉన్నాయి. వీటిలో కేవలం పదుల సంఖ్యలో నీటి శుద్ధి కర్మాగారాలకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఐఎస్ఐ ప్రమాణాలతో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడి కావాలి. జిల్లా పరిశ్రమల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నుంచి అనుమతులు ఉండాలి. కానీ జిల్లాలో చాలా మంది సుమారు 3 లక్షల పెట్టుబడి పెట్టి అనధికారికంగా నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూ.. కేవలం బోరువాటర్‌ను క్లోరినేషన్ ప్రక్రియ చేసి వడపోసి క్యాన్లలో నింపుతున్నారు. మరికొన్ని ఆర్ఒ ప్లాంట్లలో కనీసం వడపోత కూడా లేకుండా బోర్లు, మున్సిపాలిటీ కొళాయి వాటర్‌ను క్యాన్లులో నింపి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిఉంది. పాటించాల్సిన నిబంధనలుఆర్ఒ ప్లాంట్లలో ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. తర్వాత ప్రత్యేకమైన శాండ్ ఫిల్టర్ ద్వారా వడపోయాలి. ఆపై కార్బన్ ఫిల్టర్స్, మైక్రాన్ ఫిల్టర్స్ శుభ్రం చేసి మరో కంపార్టుమెంటులోకి పంపాలి. ఆఖరి దశలో ఆక్సిజన్‌ను పంపి ఆక్సీకరణ జరపాలి. ఈ దశలో మినరల్స్‌ను జతచేయాలి. కానీ ఆర్ఒ ప్లాంట్లలో ఈ దిశగా నీటిని శుద్ధి చేయడం లేదు. ఐఎస్ఐ ప్రమాణాలతో నడిచే ఆర్ఒ ప్లాంట్లు జిల్లాలో ఐదారు మాత్రమే ఉన్నాయి. నీటిశుద్ధి కర్మాగారాలపై తరుచూ తనిఖీలు నిర్వహించి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించాలి. కానీ ఇంతవరకు ఒక్క ప్లాంటుపై కూడా తనిఖీలు లేవు. ఆహార తనిఖీ విభాగం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వీటి వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. దీంతో కలుషిత నీటి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మినరల్ పేరుతో కలుషిత జలాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్నేహితుడికి ఇల్లు గిఫ్ట్‌గా ఇచ్చిన స్నేహితులు



**కర్నూలు జిల్లా, పతాకం న్యూస్:** నందవరం గ్రామానికి చెందిన జగదీష్ అనే విభిన్న ప్రతిభావంతుడికి స్నేహితులు ఇల్లు గిఫ్ట్ గా ఇచ్చారు. చిన్ననాటి నుండి గ్రామంలో పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు విభిన్న ప్రతిభావంతుడికి ఆర్థిక సహాయాన్ని అందించి నిజమైన స్నేహానికి అర్థం చెప్పారు.తమకు తోచిన సహాయాన్ని అందించి గత మూడు నెలలుగా నిర్మాణ పనులను చేపట్టారు. వారే స్వయంగా ఇంటి నిర్మాణానికి కావలసిన వస్తువులను తెప్పించి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. గురువారం గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించి జగదీష్ దంపతులకు నూతన గృహాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్ననాటి నుండి మాతో కలిసి జగదీష్ విద్యాభ్యాసం చేశాడని తెలిపారు. దేవుని దయతో మేము వ్యాపారం,వ్యవసాయం,గవర్నమెంట్ జాబులలో స్థిరపడి ఉన్నామని తెలిపారు. కానీ మా చిన్ననాటి స్నేహితుడు ఉండడానికి ఇల్లు లేక చాలా దీనస్థితిలో ఉండడం గమనించామని తెలిపారు. ఆయనకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కొద్ది రోజుల క్రితమే నిర్ణయించుకున్నామని చెప్పారు.మా స్నేహితుడు కూడా మాలాగే తన కుటుంబంతో సంతోషంగా ఉండాలని భావించామని తెలిపారు. ఆయన జీవితానికి ఇల్లు నిర్మించడమే కాకుండా రాబోయే కాలంలో ఆర్థిక సహాయాన్ని కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## నిబంధనల ఉల్లంఘనతో విస్ఫోటనం



**సామర్లకోట, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఫిబ్రవరి 28న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటనానికి నిబంధనల ఉల్లంఘనే కారణమని విచారణ కమిటీ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.సురేష్‌కుమార్ వెల్లడించారు. వేట్లపాలెం ఘటనపై సిట్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ నేతృత్వంలోని బృందం బాణసంచా విస్ఫోటన స్థలాన్ని పరిశీలించింది. ప్రమాదం నుంచి బయటపడిన కార్మికులను, ఈ ఘటనలో సస్పెండైన అధికారులను సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ అతిథిగృహంలో సిట్ అధికారులు విచారించారు. అనంతరం మీడియాతో సురేష్‌కుమార్ మాట్లాడుతూ....బాణసంచా తయారీ కేంద్రంలో 15 కిలోలు మాత్రమే మందుగుండు సామగ్రి తయారీకి అనుమతులు ఉన్నాయని, పదిమంది లోపు కార్మికులను మాత్రమే పనులకు ఉపయోగించుకునేందుకు యజమానికి అనుమతులు ఉన్నాయని తెలిపారు. వందలాది కిలోల ముడి సరుకు నిల్వ ఉంచడంతోపాటు 30 మందికి పైగా కార్మికులను పనిలో పెట్టుకున్నట్టు తెలిసిందన్నారు. పెద్దాపురం పట్టణం నుంచి ముడి సరుకు భారీగా తరలించిన వ్యక్తిని నిందితుడిగా చేర్చామని చెప్పారు. ఈ ప్రమాదంపై మరింత సమాచారం సేకరించాల్సి ఉందని, నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్ సవరణ బిల్లుకు
# రాష్ట్రపతి ఆమోదం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఈ నెల 25, 26 తేదీల్లో లోక్‌సభ, రాజ్యసభలు ఈ సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బిల్లులో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల గౌరవానికి ప్రతిబంధకంగా మారే నిబంధనలు ఉన్నాయని, కాబట్టి దీన్ని మరింత పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అలాగే ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించిన తరువాత రోజే సమారు 140 మంది న్యాయవాదులు, స్త్రీవాదులు రాష్ట్రపతి ముర్ముకు లేఖ రాసారు. ఈ బిల్లులోని కొన్ని నిబంధనలు 'రాజ్యంగ ఉల్లంఘనలు'గా ఉన్నాయని, బిల్లును ఆమోదించిన విధానంలో 'విధానపరమైన లోపాలు' ఉన్నాయని, ఈ బిల్లును ఆమోదించి వద్దని లేఖలో కోరారు. ఇన్ని వివాదాలు ఉన్నా.. బిల్లుపై రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడం విశేషం.

### ఎమ్మెల్యే అరవిందబాబు
## టీడీపీ హైకమాండ్ సీరియస్..



**పల్నాడు, పతాకం న్యూస్:** పల్నాడు ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్.అరవిందబాబు వ్యవహారం తీరుపై టీడీపీ హైకమాండ్ సీరియస్ అయ్యింది. ఈ వ్యవహారంపై లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలంటూ ఎమ్మెల్యే అరవిందబాబుకు ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ మేరకు నరసరావుపేట ఎమ్మెల్యేకు పల్లా శ్రీనివాసరావు ఫోన్ చేసి ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలో చదలవాడ అరవిందబాబు వ్యవహరించిన తీరుపై పార్టీ హైకమాండ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే అరవిందబాబుకు ఫోన్ చేసినా స్పందించకపోవడం పట్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. న్యాయ సలహాదారు పోస్ట్‌కు సిఫార్స్ చేస్తే.. అధికారులు ఆమోదించకుంటే.. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకు రావాలని.. అంతేకానీ ఇలా చేస్తే ఎలా అంటూ ఎమ్మెల్యే తీరుపై హైకమాండ్ ఆగ్రహం చెందినట్లు సమాచారం. ఈ అంశంపై లిఖిత పూర్వక వివరణ ఇస్తానని పల్లాకు అరవిందబాబు చెప్పారు. మరోవైపు నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబ్ను రెండు, మూడు రోజుల్లో అమరావతికి పిలిపించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించిరని సమాచారం. పల్నాడు జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా తాను సూచించిన రామినేని ప్రసాద్ పేరును ఎందుకు ఆమోదించంలేదని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదవలవాడ అరవిందబాబు వాగ్వాదానికి దిగారు. మంగళవారం మధ్యాహ్నం ఎస్పీ కార్యాలయానికి టీడీపీ ఎమ్మెల్యే వచ్చారు. న్యాయ సలహదారుగా నియమించాలని ఎనిమిది నెలల క్రితం లేఖ పంపితే.. నేటికి దానిపై సంతకం చేయలేదన్నారు. దీనిపై విచారణ జరిపి సంతకం చేస్తానని ఆయనకు ఎస్పీ తెలిపారు. ఆయన మాటలను టీడీపీ ఎమ్మెల్యే లక్ష్యపెట్టక.. రామినేని ప్రసాద్‌ను నియమిస్తూ ఆర్డర్ కాపీ తనకు ఇచ్చే వరకు ఎస్పీ కార్యాలయం నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. దాదాపు 10 గంటల పాటు ఎస్పీ చాంబర్‌లోనే ఎమ్మెల్యే ఉండిపోయారు. ఆ సమయంలో మంత్రుల కార్యాలయాల నుంచి ఫోన్లు వచ్చినా ఎమ్మెల్యే స్పందించలేదని తెలుస్తోంది. అలాగే ఆర్డీవో కార్యాలయంలో సైతం ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఇదే విధంగా వ్యవహరించారని తెలుస్తోంది.

## బాధితులకు పోగొట్టుకున్న నగదు ఎస్సై చేతులు మీదుగా అందజేత

**నార్పల, పతాకం న్యూస్:** మండల పరిధిలోని కేసేపల్లి గ్రామ సమీపంలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద గత రెండు రోజుల క్రితం రోడ్డుపై లక్ష్మీనరసింహులు అనే విద్యార్థికి రూ. 49 వేలు నగదు దొరకడంతో ఉపాధ్యాయుడు శాంత ప్రకాష్ రెడ్డికి అందజేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు ఎస్సై సాగర్ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. గురువారం నగదు పోగొట్టుకున్న బాధిత వ్యక్తి జుల కాల్వ రవీంద్రకు పోలీస్ స్టేషన్లో ఎస్సై సాగర్ చేతుల మీదుగా నగదు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, ఉపాధ్యాయునీ ప్రత్యేకంగా అభినందించారు. నగదు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, నగదు తీసుకొని వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాధితుడు రవీంద్రకు సూచించారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి



**మదనపల్లె, పతాకం న్యూస్:** మదనపల్లె అర్బన్ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసు కొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వ ర్యంలో బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని కార్మిక సంఘాల పిలుపు మేరకు మదనపల్లెలో కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికవర్గానికి నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.30 వేలు అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ సామాజిక ఆరోగ్య భద్రత కొరవడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా కార్మికులను మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 36 కోట్ల మంది కార్మిక వర్గం ఫిబ్రవరి 12న సమ్మె చేసినప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వం పట్టించుకోకుండా ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేయాలని నిర్ణయించడం దుర్మార్గ మన్నారు. అదానీ, అంబానీ సేవలో తప్ప కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత ఏ మాత్రం పట్టించు కోకుండా లేబర్ కోడ్స్ అమలు చేయటంపై నిరస నగా బ్లాక్ డే నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, తుల సమ్మ, శంకరమ్మ, సంగీత, వెంకటరమణ పాల్గొన్నారు. రాయచోటి టౌన్ : కార్మిక సంక్షేమం కోసం రక్షణగా ఉన్న 28 రకాల చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు లాభం చేకూర్చే నాలుగు లేబర్‌కోడ్‌లను ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ బ్లాక్ డేగా పరిగణిం చామని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. బుధవారం దేశవ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు ఎం.సుధీర్ కుమార్, రైతు సంఘశీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎంపీలు ఎక్కువ ఉన్నారని, కార్మికుల నడ్డి విరిచి కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం దారుణమని తెలిపారు. బిజెపి వైఖరికి కార్మిక వర్గం గట్టి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డా యన్నారు. రాచరిక వ్యవస్థలో ప్రజల్ని బానిసలుగా చూసిన రాజులు చరిత్ర హీనుల యారని, కాల గర్భంలో కలసి పోయారని పేర్కొ న్నారు. కార్మిక వర్గం చైతన్య వంతమైన రోజున బిజెపికి ఉనికి ఉండదని హితువు పలికారు.

## ఆటిజంపై అవగాహన సదస్సు

**పెద్దాపురం, పతాకం న్యూస్:** స్థానిక మహాత్మా గాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో గురువారం ఆటిజంపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆటిజంపై, ఆటిజం పిల్లల పట్ల అనుసరించవలసిన మానవత్వం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహిత ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్ రెడ్డి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజంపై ఐదుగురు ఆటిజం పిల్లలకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

# గర్భధారణ సమయంలో మహిళలు ఒత్తిడిని తగ్గించుకోవాలి..!

గర్భధారణ మహిళల జీవితంలో ఆనందకరమైన దశ అయినప్పటికీ, ఇది భావోద్వేగ, శారీరక ఒత్తిడికి కూడా కారణమవుతుంది. గర్భధారణ సమయంలో దీర్ఘకాలిక ఒత్తిడి నిద్రలేమి, అధిక రక్తపోటు, ఆకలి తగ్గడం వంటి సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా ముందస్తు ప్రసవం (ప్రి-టర్మ్ బర్త్), తక్కువ బరువుతో శిశువు జననం వంటి ప్రమాదాలకూ కారణమవుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల ఒత్తిడిని నియంత్రించడం ప్రీనేటల్ కేర్‌లో కీలక భాగంగా మారింది. గర్భధారణ అనేది శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా మార్పులు తీసుకువచ్చే ప్రయాణం. హార్మోన్ల మార్పులు, శరీర అసౌకర్యం, శిశువు ఆరోగ్యం, ప్రసవంపై ఆందోళనలు వంటివి ఒత్తిడికి కారణమవుతాయి. కొంతమేర ఒత్తిడి సహజమైనదే అయినప్పటికీ అధిక ఒత్తిడి తల్లి, గర్భంలోని శిశువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల కార్టిసోల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇవి తల్లి ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పరోక్షంగా శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తాయి. నిద్రలేమి, రక్తపోటు పెరగడం, ఆకలి తగ్గడం వంటి సమస్యలు కలుగుతాయి. అలసట పెరిగే కొద్దీ ఒత్తిడి కూడా పెరుగుతుంది. కనుక నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. అవసరమైతే పగటిపూట చిన్నపాటి విశ్రాంతి తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు రిలాక్సేషన్ అలవాట్లు ఏర్పరుచుకోవడం చక్కటి ఉపశమనాన్ని ఇస్తుంది. అలాగే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటే మూడ్ కూడా స్థిరంగా ఉంటుంది. చిన్న పరిమాణాల్లో తరచుగా ప్రోటీన్లు, ధాన్యాలు, పండ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అలసట, చిరాకు తగ్గి ఒత్తిడి తగ్గుతుంది. తగిన విశ్రాంతి తీసుకుంటూనే శారీరకంగా చురుకుగా ఉండాలి. డాక్టర్ సూచించిన వ్యాయామాలతో పాటు నడక, ప్రీనేటల్ యోగా, స్ట్రెచింగ్ వంటి కార్యకలాపాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇవి ఎండోర్ఫిన్స్ విడుదలకు సహాయపడి మానసిక ప్రశాంతతను పెంచుతాయి. వీటితో పాటు భర్త, కుటుంబ సభ్యులు లేదా వైద్యులతో మాట్లాడటం ద్వారా భావోద్వేగ ఒత్తిడి తగ్గుతుంది. ప్రసవం, శరీర మార్పులు, శిశువు సంరక్షణపై ఉన్న భయాలను వారితో పంచుకోవడం మంచిది.

ఎక్కువ ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి లక్షణాలు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అవసరమైతే వైద్యులను సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది. ఇది తల్లి, శిశువు ఇద్దరి ఆరోగ్యానికి ఉపయోగకరం. శాంతంగా ఉన్న తల్లి ఆరోగ్యకరమైన గర్భధారణకు సూచిక. అందువల్ల గర్భిణీలు విశ్రాంతికి సమయం కేటాయిస్తూ, తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం అత్యంత ముఖ్యమని వైద్యులు తెలియజేస్తున్నారు.

# జీవీఎంసీ వార్డుల విభజన ప్రారంభం!

## జీవీఎంసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ప్రస్తుతం ఉన్న 98 వార్డులను 120కి పెంచుతూ వారం కిందట ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం వార్డుల విభజనను గురువారం నుంచి ప్రారంభించాలని, వచ్చే నెల ఐదో తేదీ నాటికి సరిహద్దులతో గెజిట్ జారీచేయాలని ఆదేశించింది. దీంతో జీవీఎంసీకి ఆరు నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి వార్డుల విభజన ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని జీవీఎంసీ పరిధిలో ఈశాన్యం వైపు నుంచి క్లాక్ వైజ్ డైరెక్షన్‌లో వార్డుల విభజన చేపట్టాలని సూచించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జీవీఎంసీ జనాభా 19 లక్షలు. వీరందరినీ 120 వార్డులకు సమానంగా విభజిస్తే 15,840 మంది చొప్పున ఉంటారు. వార్డు సరిహద్దుల నిర్ణయంలో సహజ సిద్ధంగా ఉండే రోడ్లు, డ్రైనేజీలు, చెరువులు ఉండేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో హద్దుల నిర్ణయం క్లిష్టంగా మారితే వార్డు సగటు జనాభాలో పది శాతం ఎక్కువ లేదా తక్కువ ఉండవచ్చు. వార్డుల విభజన ప్రక్రియను గురువారం ప్రారంభించి ఈనెల తొమ్మిదో తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది. తర్వాత వార్డుల హద్దులతో కూడిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లోని నోటీసు బోర్డులో అతికించి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని, పదో తేదీ నుంచి 16 తేదీ వరకు ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించింది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మార్పులు, చేర్పులు చేసిన తర్వాత 17వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య ఫైనల్ డ్రాఫ్ట్‌ను సీడీఎంఏకు పంపించాల్సి ఉంటుంది. జీవీఎంసీ నుంచి అందిన వార్డుల విభజన డ్రాఫ్ట్‌ను సీడీఎంఏ పరిశీలించిన తర్వాత ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నివాసిత సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, డ్రాఫ్ట్‌ను ఆమోదించడానికి ఈనెల 26 నుంచి మే రెండు వరకు అవకాశం కల్పించింది. సీడీఎంఏ ఆమోదం తర్వాత వార్డుల విభజనకు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్‌తో కూడిన గెజిట్‌ను మే మూడు నుంచి ఐదో తేదీ లోపల జీవీఎంసీ కమిషనర్ విడుదల చేయాలని స్పష్టంచేసింది. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నిర్ణయం మేరకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. జీవీఎంసీ పరిధిలో గతంలో ఉన్న ఎనిమిది జోన్‌ల పరిధిలో వార్డుల సంఖ్య భారీగా పెరుగుతుంది. ఒక్కో వార్డులో సగటున 15,840 మంది జనాభా ఉండేలా విభజన జరిగితే భీమిలి జోన్‌లో ఐదు వార్డులు, జోన్-2 (మధురవాడ) పరిధిలో 11 వార్డులు, జోన్-3 (ఆశీల్‌మెట్ట) పరిధిలో 18, జోన్-4 (సూర్యాబాగ్) పరిధిలో 15, జోన్-5 (జ్ఞానాపురం) పరిధిలో 28, జోన్-6 (గాజువాక) పరిధిలో 24, జోన్-7 (అనకాపల్లి) పరిధిలో 6, జోన్-8 (వేపగుంట) పరిధిలో 13 వార్డులు ఉండబోతున్నాయి.

# చమురు ట్యాంకర్ల దిగ్బంధనం



**న్యూయార్క్:** స్ట్రైట్ ఆఫ్ హోర్ముజ్ నుంచి తమకు ఆయిల్ అవసరం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. సముద్ర మార్గం నుంచి తమకు ఆయిల్ అక్కర్లేదని, భవిష్యత్తులో కూడా అవసరం ఉండదని తేల్చి చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి ఆయిల్ తెచ్చుకుంటున్న దేశాలకు ఆయన ఓ విజ్ఞప్తి చేశారు. ఆ మార్గాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, స్వాధీనం చేసుకుని కాపాడుకోవాలని సూచించారు. ఈ విషయంలో అమెరికా తప్పకుండా సాయం చేస్తుందని అన్నారు. గురువారం ఉదయం ట్రంప్ జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'నేను రెండు సలహాలు ఇస్తాను. ఒకటి.. అమెరికా దగ్గర ఆయిల్ పుష్కలంగా ఉంది. కాబట్టి మా దగ్గరి నుంచి ఆయిల్ కొనండి. రెండోది.. ఇకనైనా ధైర్యం తెచ్చుకుని స్ట్రైట్ ఆఫ్ హోర్ముజ్‌ను స్వాధీనం చేసుకుని కాపాడుకోండి. ఈ పని మీరు ముందే చేయాల్సింది. మాతో పాటు కలిసి ఈ పని చేయాల్సింది. కలిసి రమ్మని కూడా అడిగాము. నేరుగా స్ట్రైట్ ఆఫ్ హోర్ముజ్ దగ్గరకు వెళ్లండి. దాన్ని స్వాధీనం చేసుకుని కాపాడుకోండి' అని అన్నారు. ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లో పాలకవర్గం మార్పునకు ఒత్తిడి తీసుకురాలేదని స్పష్టం చేశారు. వియత్నాం యుద్ధం ముగియడానికి 19 ఏళ్లు పట్టిందని, అమెరికన్ల భవిష్యత్ కోసమే ఈ యుద్ధం చేస్తున్నామని అన్నారు. 2-3 వారాల్లో భీకరదాడులు చేస్తామని తెలిపారు. యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితి లేదని వెల్లడించారు. గల్ఫ్ దేశాలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సౌదీ, కువైట్, బహ్రెయిన్‌కు భద్రత కల్పిస్తామని తెలిపారు. ఇరాన్‌పై జరుగుతున్న సైనిక చర్యల్లో అమెరికా తన 'ప్రధాన లక్ష్యాలను' విజయవంతంగా చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన ఈ దాడులు కీలకమైన ఘట్టానికి చేరుకున్నాయని, అయితే శత్రువు పూర్తిగా బలహీనపడే వరకు దాడులు కొనసాగుతాయని ఆయన చెప్పుకొచ్చారు. 47 ఏళ్లుగా అమెరికా, ఇజ్రాయెల్ అంతం కావాలని ఇరాన్ కోరుకున్నదని చెప్పారు. అమెరికాను శక్తివంతమైన దేశంగా మారుస్తున్నామని, ఇరాన్ తాను చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తోందని ట్రంప్ అన్నారు.'నా పాలనలో ఎన్నో విజయాలను సాధించాం.. గత అధ్యక్షులు చేసిన తప్పులను సరిచేస్తున్నా.' అని ట్రంప్ తన ప్రసంగంలో చెప్పుకొచ్చారు.




# అంతర్జాతీయ క్రికెట్‌కు స్టార్ ప్లేయర్ గుడ్ బై!




సౌతాఫ్రికా క్రికెట్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ రాస్సీ వాన్ డెర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే డొమాస్టిక్ క్రికెట్‌లో మాత్రం 'లయన్స్' జట్టు తరపున మాత్రం ఆడడం కొనసాగిస్తానని స్పష్టం చేశాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ గురువారం సోషల్ మీడియా వేదికగా తన నిర్ణయాన్ని వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఓ సందేశాన్ని పోస్ట్ చేశాడు. 'దక్షిణాఫ్రికా క్రికెట్‌కు అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించినందుకు గర్వంగా భావిస్తున్నాను. ప్రోటీస్ జెర్సీ ధరించిన ప్రతిసారీ ఒక ప్రత్యేక అనుభూతి కలుగుతోంది. ప్రగాఢమైన కృతజ్ఞతా భావంతో నేను అంతర్జాతీయ క్రికెట్ నుంచి నా విరమణను ప్రకటిస్తున్నాను. అయితే ప్రోటీస్ క్రికెట్‌కు నా సేవలను అందించేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. నా అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, నేను దేశీయ జట్టు అయిన లయన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూనే, కోచింగ్‌లోకి మారుతాను. ఇప్పటి వరకు నా క్రికెట్ ప్రయాణంలో మద్దతుగా నిలిచిన సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుకు, నా సహచరులకు, అభిమానులందరికి కృతజ్ఞతలు' అని వాన్ డెర్ డస్సెన్ పేర్కొన్నాడు. 2018 అక్టోబర్ 9న డస్సెన్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చాడు. సౌతాఫ్రికా తరఫున 71 వన్డేలు, 18 టెస్టులు, 57 టీ20ల్లో ఆడాడు. ముఖ్యంగా వన్డేల్లో ప్రోటీస్‌కు కీలక ప్లేయర్‌గా నిలిచాడు. 2019 జనవరి 19న వన్డే క్రికెట్ లోకి తొలిసారి అడుగుపెట్టాడు. అరంగేట్రంలోనే 90కి పైగా స్కోరు నమోదు చేసిన ఐదవ బ్యాటర్‌గా డస్సెన్ నిలిచాడు. అతడి పేరిట 6 వన్డే సెంచరీలు ఉన్నాయి. 2023, 2019 ప్రపంచకప్‌లలో సౌతాఫ్రికాకు అతడు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో అతడు రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడాడు. మొత్తంగా డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌లో 49168 పరుగులు చేశాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం



లక్నో సూపర్‌జెయింట్స్(ఎల్ఎస్‌జి) తొలి మ్యాచ్‌లోనే తడబడింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు ఎన్గిడి(3/27), నటరాజన్(3/29)కి తోడు కుల్దీప్ యాదవ్(2/31) కట్టడిగా బౌల్ చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు 18.4ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. ఛేదన లో భాగంగా ఢిల్లీ జట్టు 26పరుగులకే 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డా.. ఇంపాక్ట్ ప్లేయర్ గా బ్యాటింగ్‌కు దిగిన సమీర్ రిజ్వీ అర్ధసెంచరీకి తోడు స్టబ్స్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ముఖ్యంగా రిజ్వీ(70 నాటౌట్; 47 బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు స్టబ్స్(39నాటౌట్; 32బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించారు. వీరిద్దరూ 5వ వికెట్‌కు 119 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రిషబ్ పంత్(7) రనౌట్ కావడంతో జట్టు వికెట్ల పతనం మొదలైంది. ఆ తర్వాత మార్‌క్రమ్(11), బడోనీ(0), పూరన్(8) నిరాశపరి చారు. దీంతో లక్నో 71పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్(35)కి తోడు షాబాజ్ అహ్మద్ (15), ముకుల్ చౌదరి(14) లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లో రాణించారు. కానీ చివర్లో షమీ(1), నోర్జే(0), మొహిసిన్ ఖాన్(0) స్వల్ప స్కోర్లకే పెవిలి యన్‌కు చేరడంతో లక్నో ఇన్నింగ్స్ 141పరుగులకు ముగిసింది. ఛేదనలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌కూ శుభారంభం దక్కలేదు. కెఎల్ రాహుల్(0)ను మహ్మద్ షమీ బౌల్డ్ చేయగా.. నిస్సంకను ప్రిన్స్ యాదవ్ త్వరగా పెవీలియన్‌కు పంపాడు. నితీశ్ రాణాకు తోడు కెప్టెన్ అక్షర్ పటేల్(0) డకౌట్ కావడంతో ఢిల్లీ జట్టు 26పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు దిగిన సమీర్ రిజ్వీ కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము కానీయలేదు. ఫోర్లు, సిక్సర్లతో అర్ధసెంచరీ సాధించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. లక్నో బౌలర్లు ప్రిన్స్ యాదవ్‌కు రెండు, షమీ, మొహిసిన్ ఖాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సమీర్ రిజ్వీకి దక్కింది.

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి)స్టబ్స్ (బి)కుల్దీప్ 35, పంత్ (రనౌట్) ముఖేష్ కుమార్ 7, మార్‌క్రమ్ (బి)అక్షర్ పటేల్ 11, బడోనీ (సి)కెఎల్ రాహుల్ (బి)నటరాజన్ 0, పూరన్ (బి)ఎన్గిడి 8, అబ్దుల్ సమద్ (సి)డేవిడ్ మిల్లర్ (బి)నటరాజన్ 36, ముకుల్ చౌదరి (సి అండ్ బి)కుల్దీప్ 14, షాబాజ్ అహ్మద్ (నాటౌట్) 15, మహ్మద్ షమీ (బి)కుల్దీప్ (బి)నటరాజన్ 1, నోర్జే (సి)స్టబ్స్ (బి)ఎన్గిడి 0, మొహిసిన్ ఖాన్ (సి)ముఖేష్ కుమార్ (బి)ఎన్గిడి 0, అదనం 14. (18.4ఓవర్లలో ఆలౌట్) 141పరుగులు.


వికెట్ల పతనం: 1/19, 2/48, 3/49, 4/65, 5/71, 6/105, 7/138, 8/140, 9/141, 10/141

బౌలింగ్: ముఖేష్ కుమార్ 3-0-17-0, ఎన్గిడి 3.4-0-27-3, అక్షర్ పటేల్ 3-0-17-1, నటరాజన్ 4-0-29-3, కుల్దీప్ 4-0-41-2, విప్‌రాజ్ నిగమ్ 1-0-8-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: కెఎల్ రాహుల్ (సి)మొహిసిన్ ఖాన్ (బి)సిరాజ్ 0, నిస్సంక (సి)పంత్ (బి)ప్రిన్స్ యాదవ్ 1, నితీశ్ రాణా (సి)అబ్దుల్ సమద్ (బి)మొహిసిన్ ఖాన్ 15, సమీర్ రిజ్వీ (నాటౌట్) 70, అక్షర్ పటేల్ (బి)ప్రిన్స్ యాదవ్ 0, స్టబ్స్ (నాటౌట్) 39, అదనం 20. (17.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 145పరుగులు. వికెట్ల పతనం: 1/0, 2/21, 3/25, 4/26. బౌలింగ్: షమీ 4-0-28-1, ప్రిన్స్ యాదవ్ 3-0-20-2, మొహిసిన్ 4-1-19-1.




## ధురంధర్ రెండు పార్ట్‌లు కలిపి ఒకే సినిమాగా.. 7 గంటల రన్‌టైమ్‌తో థియేటర్లలోకి!



బాలీవుడ్ డైరెక్టర్ ఆదిత్య ధర్ సెన్సేషనల్ 'ధరంధర్' ఫ్రాంచైజీలో పార్ట్ 1 అండ్ పార్ట్ 2 భారీ బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. ఈ సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రెండు పార్ట్‌లు కూడా 3.30 గంటలకు పైగా రన్‌టైమ్ ఉన్నప్పటికీ ఎక్కడా బోర్ ఫీల్ అవ్వకుండా థియేటర్లలో ఆడియెన్స్ సినిమాను ఎంజాయ్ చేశారు. అయితే మేకర్స్ ఇప్పుడు కొత్త ప్రయోగానికి సన్నాహాలు చేస్తున్నారు! ఈ రెండు భాగాలు కలిపి ఒకే సినిమాగా తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం 7.30 గంటల రన్‌టైమ్‌తో కొత్త వెర్షన్‌ను ఆడియెన్స్ కోసం రెడీ చేయనున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. ఈ వెర్షన్‌ను కేవలం ఎంపిక చేసిన థియేటర్లలో అదీనూ వీకెండ్స్‌లో ఐమాక్స్, హెచ్‌డీఆర్ ఫార్మాట్లలో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. అయితే మేకర్స్ ఐడియా బాగానే ఉన్నప్పటికీ దాదాపు ఎనిమిది గంటలు ఆడియెన్స్‌ను థియేటర్లలో కూర్చొబెట్టాలంటే సవాలుతో కూడుకున్న పనే. మూవీ లవర్స్ మాత్రమే ఇంతటి రన్‌టైమ్ ఉన్న సినిమాను చూసేందుకు ఇష్టపడతారు. కానీ అది కూడా ఎంతవరకు వర్కౌట్ అవుతుందనేది చూడాలి. ప్రస్తుతానికైతే ఇది చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇది నిజమైతే ధురంధర్ మేకర్స్ బాహుబలిని ఫాలో అయినట్లే! దర్శకధీరుడు రాజమౌళి బ్లాక్‌బస్టర్ బాహుబలి పార్ట్ 1 అండ్ 2ను గతేడాది మేకర్స్ ఒకే సినిమాగా తీసుకువచ్చారు. ఈ సినిమా తొలి పార్ట్ రిలీజై 10ఏళ్లు పూర్తైన సందర్భంగా 'బాహుబలి ది ఎపిక్' పేరుతో ఒకే చిత్రంగా గతేడాది అక్టోబర్‌లో థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. ఈ ఎపిక్ సినిమా మొత్తం 5 గంటల రన్‌టైమ్ ఉండడం విశేషం. అయినప్పటికీ ప్రేక్షకులు ఆదరించారు. దురందర్-2 సినిమా రిలీజై 14 రోజులు గడుస్తున్నా బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తూనే ఉంది. భారత్‌తోపాటు ఓవర్సీస్‌లోనూ కాసుల వర్షం కురిపిస్తుంది. అలా ఇప్పటిదాకా ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.1400 కోట్లు వసూల్ చేసింది. ముఖ్యంగా రెండో వీకెండ్‌లో అదిరే నెంబర్లు వచ్చాయి. రెండో శనివారం (10వ రోజు) రూ.62.85 కోట్లు రాగా, తర్వాతి రోజు ఆదివారం (11వ రోజు) రూ.68.10 కోట్లు వసూల్ అయ్యాయి. ఏ సినిమాకైనా రెండో వీకెండ్‌లో ఈ రేంజ్‌లో కలెక్షన్లు రావడం చాలా అరుదు.

## మే 8న 'హరుడు' విడుదల




వెంకట్ కథానాయకుడిగా విఆర్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొందుతున్న సినిమా 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. వేసవి కానుగా మే 8న ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. డి.లక్ష్మణరావు, ప్రవీణ్‌రెడ్డి సహ నిర్మాతలు. 'ఇది కంప్లీట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్లు ఇందులో ఉంటాయి. ఇది అన్ని తరగతుల ప్రేక్షకులని అలరించే కథ. హీరో వెంకట్‌కి ఈ సినిమా మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది' అని చిత్ర నిర్మాతలు తెలిపారు. వెంకట్, శ్రీహరి, హెబ్బపటేల్, సలోని, నాటషా, అలీ, సుమన్, రవి వర్మ, సుభాశ్రీ, వేద్విక, చాందిని రావు, రవి, షాని, ఆదిత్య, సమేట గాంధీ, దిల్ రమేష్, దొరబాబు తదితరులు నటించారు. కథ, మాటలు, స్క్రీన్ ప్లే దర్శకత్వం రాజ్ తాళ్లూరి, సంగీతం మని జీన్స, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ జీసీ క్రిష్, డిఓపి ఆనంద్, ఎడిటర్ ఉప్పు మారుతీ, ప్రొడక్షన్ డిజైనర్ ఓంకార్ కడియం, యాక్షన్ కొరియోగ్రఫీ శివ రాజ్.




### తెలంగాణ నేపథ్య కథతో..

## సుకుమార్ నిర్మాణంలో సినిమా



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో తెలంగాణ నేపథ్య కథలను తరచుగా చూస్తున్నాం. తెలంగాణ మట్టికథలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రధాన కథావస్తువుగా తీసుకుని దర్శకులు భావోద్వేగ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 'బలగం' ఈ కోవలోనే ఎలాంటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ చిత్రాన్ని తెలంగాణలోని ప్రతి పల్లెలో తెరలు కట్టుకుని చూస్తూ ఎమోషనల్ అయ్యారు. 'బలగం' తరువాత తెలంగాణ నేపథ్య కథలతో సినిమాలు తెరకెక్కించడానికి దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు.

ఇక త్వరలో మరో తెలంగాణ నేపథ్య కథతో సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ తన సొంత నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ సంస్థపై చిత్రాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సుకుమార్ రైటింగ్స్ సంస్థ నాగచైతన్య హీరోగా నటిస్తున్న వృషకర్మ, రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రాలకు నిర్మాణ భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్, నిర్మాత బన్నీవాస్‌లు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు.

'బలగం' ఫేమ్ ప్రియ దర్శి హీరోగా నటించనున్న ఈ చిత్రం తెలంగాణ నేపథ్య కథతో రూపొందనుందని సమాచారం. ఈ చిత్రం ద్వారా ఓ నూతన దర్శకుడు పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దర్శకుడిగా స్టార్స్‌తో పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కిస్తున్న దర్శకుడు సుకుమార్, నిర్మాతగా కూడా ఇలాంటి కథలతో చిన్న సినిమాలు నిర్మించడం నిజంగా ప్రశంసనీయం.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**